సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 27 । జనవరి । 2023



సాంస్కృతిక కార్యక్రమాల్లో గురుకుల పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన



గిరిజనుల వేషధారణలో నృత్యం

న్యూస్‌రీల్

అడిషనల్ ఎస్పీ బదిలీ



ఏఎస్పీ రషీద్

అనంతగిరి: అడిషనల్ ఎస్పీ ఎంఏ రషీద్ బదిలీ అయ్యారు. ఆయన మూడేళ్లుగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆయన సేవలను ఎందరో కొనియాడారు. అందరిచేత మన్ననలు అందుకున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ ఎస్ఓటీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించలేదు.

భాస్కరయోగికి సాహితీ పురస్కారం



పరిగి: సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు తెలుగు యూనివర్సిటీ- 2020 పురస్కారాలు ప్రకటించింది. పట్టణ కేంద్రానికి చెందిన భాస్కర యోగి ఎంపికయ్యారు. వచన రచన విభాగంలో హిందువుల పండుగలు అనే గ్రంథానికి సాహితీ పురస్కారం దక్కింది. యోగిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపక బృందం శాలువతో సన్మానించారు. సాహితీ పురస్కానికి ఎంపిక కావడం పట్ల భాస్కర యోగిని పలువురు అభినందించారు.

న్యాక్ మెయిల్స్‌కు స్పందించండి

తాండూరు టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం కో ఆర్డినేటర్ నాగేశ్వరాచారి కోరారు. విద్యార్థులకు న్యాక్ నుంచి మెయిల్ వస్తాయని, ఇందులో సరళమైన ఆంగ్లంలో 20 ప్రశ్నలుంటాయన్నారు. ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న సేవలపై ఉండే ప్రశ్నలకు విద్యార్థులు తప్పకుండా స్పందించాలన్నారు. విడతల వారీగా న్యాక్ కేంద్రం వారు మెయిల్స్ పంపుతారన్నారు. ప్రతి రెండు రోజులకు ఒకసారి మెయిల్‌ను చెక్ చేసుకోవాలన్నారు. అడిగిన ప్రశ్నలపై మీ అభిప్రాయాన్ని క్లిక్ చేసి, పూర్తయిన తర్వాత సబ్మిట్ చేయాలన్నారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఎగ్జిబిషన్

చార్మినార్: సాలార్‌జంగ్ మ్యూజియంలోని సెంట్రల్ బ్లాక్‌లో గురువారం 'ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ అండ్ ఫ్రీడం ఫైటర్స్' ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలతో పాటు ఆనాటి మహానుభావులతో కూడిన ఈ ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ వారం రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

అందరికీ విద్య, వైద్యం

సంక్షేమ పథకాల అమలులో పారదర్శకం

- పల్లె, పట్టణ ప్రగతితో విప్లవాత్మక మార్పులు
- మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు
- దళితబంధుతో పేదల్లో సాధికారత
- వ్యవసాయంలో నూతన ఒరవడులు
- కలెక్టర్ నిఖిల వెల్లడి
- వైభవంగా గణతంత్ర వేడుకలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ నిఖిల, చిత్రంలో ఏఎస్పీ రషీద్

వికారాబాద్: విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, అలాగే మౌలిక సదుపాయాల కల్పన కోసం జిల్లా యంత్రాంగం విశేషంగా కృషి చేస్తోందని కలెక్టర్ నిఖిల అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా పనిచేస్తున్నామని తెలిపారు. 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ జాతీయ జెండా ఎగురవేశారు. ఏఎస్పీ రషీద్‌తో కలిసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయా పాఠశాలలు, గురుకుల, మోడల్ స్కూల్, సంఘం లక్ష్మీబాయి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి తిలకించారు. ఆయా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

187 మందికి ప్రశంసాపత్రాలు

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 187 మంది అధికారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. 308 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. రైతు బంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకం, కంటి వెలుగు, దళిత బంధు, విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం తదితర కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

6,284 మందికి కేసీఆర్ కిట్లు

2022–23 ఏడాదిలో జిల్లాలో 6,284 కేసీఆర్ కిట్లు అందించామన్నారు. వైద్య శాఖ ద్వారా 14099 మంది గర్భిణులకు సేవలందివ్వగా ఇందులో 12,853 ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రులలో జరిగాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 9,720 మందికి రూ. 2.14 కోట్ల నిధులు ప్రభుత్వ ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయగ్నోస్టిక్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు 79,103 మందికి ఆయా రకాల పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 42 పరీక్షా కేంద్రాల ద్వారా 28, 287 మందికి వైద్య పరీక్షలు పూర్తి చేసి ఇందులో 5,040 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. మన ఊరు–మన బడి లాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యా, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉపాధి హామీ పనులు కల్పించటంలో జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచిందన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనివిధంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని కలెక్టర్ నిఖిల తెలిపారు. సమగ్ర అభివృద్ధి, మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పట్టణ, పల్లె ప్రగతి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వైకుంఠధామాలు, స్మృతి వనాలు, పెద్దలు, పిల్లలకు అహ్లాదకరమైన పార్కుల ఏర్పాటు, పచ్చదనం కోసం నర్సరీలు, మొక్కల పెంపకం, డంపింగ్ యార్డులు, ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు, నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, పారిశుద్ధ్యం కోసం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందించడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మిషన్‌భగీరథ కార్యక్రమంతో ఇంటింటికీ నీరిందిస్తున్నామని తెలిపారు. రూ. 19.89 కోట్లతో జిల్లాలో 97 రైతు వేదికల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్వో అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, జిల్లా అధికారులు కృష్ణన్, పల్వాన్‌కుమార్, రేణుకాదేవి, గో పాల్, హన్మంతరావ్, కోటాజి, విమల, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, చక్రపాణి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



సమీకృత కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ నిఖిల

జెండాకెక్కిన వర్గపోరు!

- బీఆర్ఎస్‌లో మళ్లీ బహిర్గతం
- జెండా ఆవిష్కరణలో నేతల మధ్య పరస్పర దూషణలు



వైస్ ఎంపీపీ మల్లేశంతో వాగ్వాదానికి దిగిన ఎంపీపీ తనయుడు రాఘవేందర్‌రెడ్డి

దోమ: అధికార బీఆర్ఎస్ పార్టీలో వర్గపోరు మరోసారి భగ్గుమంది. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అనుచర నాయకుల మధ్య రాజకీయం రచ్చకెక్కింది. గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఇరువురు నేతల అనుచరుల తిట్ల పురాణం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జయరాం జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశంతో పాటు ఆయా పార్టీల నేతలు, అధికారులు హాజరయ్యారు. ఈ క్రమంలో ఎంపీపీ(డీసీసీబీ చైర్మన్ అనుచరురాలు) జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు రాగా, వైస్ ఎంపీపీ (ఎమ్మెల్యే అనుచరుడు) ఆమెను అడ్డుకున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను అధికారికంగా అధికారులు ఎగురవేయాల్సి ఉంటుందని వైస్ ఎంపీపీ అన్నారు. దీంతో జోక్యం చేసుకున్న ఎంపీపీ తనయుడు రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ జెండాను ఎంపీపీ ఎగురవేస్తారని వాగ్వాదానికి దిగారు. ఇద్దరి నేతలు పరస్పరం దూషించుకున్నారు. వివాదం తీవ్రమైంది. అక్కడే ఉన్న అధికారులు, మిగతా నేతలు సముదాయించేందుకు యత్నించినా వారు శాంతించలేదు. మరోవైపు ఎంపీపీ అనసూయ, ఎంపీడీఓ జయరాంతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు.

అధికార నిబంధనలు మరిచి..

జాతీయ జెండా ఆవిష్కరణ విషయంలో ఎంపీడీఓ జయరాం నిబంధనలు మరిచి విధులు నిర్వహించారని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ అధికారిగా జెండాను గణతంత్ర దినోత్సవంలో ఎవరు ఎగురవేయాలి? ఏ సమయంలో ఎగురవేయాలి? అనే విషయాలను నేతలకు తెలపకుండా చేపట్టడంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. అధికార పార్టీ నేతలు పరస్పర దూషించుకుంటుంటే ఎంపీడీఓ మౌనంగా ఉండడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా.. గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు ఎగురవేయాల్సి ఉంటుందన్నారు. కానీ నేతలు పరస్పరం దూషించుకుంటారని అనుకోలేదని అన్నారు.

దత్తత తీసుకుని ఏం చేశారో చెప్పాలి

- కొడంగల్‌లో నేను చేసిన అభివృద్ధే కనిపిస్తోంది
- ప్రజలంతా గమనిస్తున్నారు
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలో తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని, నేడు ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. పీసీసీ చీఫ్ చేపట్టిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమం గురువారం రాత్రి కొడంగల్‌కు చేరుకొంది. పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి దేవాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు యాత్ర కొనసాగింది. రోడ్ షోలో మాట్లాడుతూ నాడు జరిగిన అభివృద్ధిని చూసి గెలిపించాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గం గతం నుంచి అభివృద్ధికి నోచుకోకుండా వెనకబాటుకు గురవుతూఉండేదని అన్నారు. తాను 2009లో ఎమ్మెల్యేగా గెలిచాక కొడంగల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని చెప్పారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు 2009 నుంచి 2018వరకు తన హయాంలోనే మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, మద్దూరు, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో చేసిన అభివృద్ధి పనులు తన హయాంలోనే జరిగాయని చెప్పారు. నాడు ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో ఇప్పటికీ కొన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగా నిలిపివేశారని తెలిపారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో కొడంగల్‌ను దత్తత తీసుకున్న మంత్రి కేటీఆర్ ఎంత అభివృద్ధి చేశారో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం తెలంగాణలో అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుని మొదటి స్థానంలో నిలుస్తుందని అన్నారు. తెలంగాణ రాజకీయాలను శాసించే స్థాయి కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు, ఆనంద్‌రెడ్డి, దాము, నయీమ్ పాల్గొన్నారు.

పనులు మొక్కుబడి
కానరాని మనబడి

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- డెడ్‌లైన్ ముగిసినా పూర్తికాని పనులు
- 38 పాఠశాలల నుంచి 19కి కుదింపు?
- అయినా సిద్ధంకాని స్కూళ్లు
- ఏఈల పర్యవేక్షణ లోపమే కారణమా?



మన ఊరు- మనబడి కింద సిద్ధమవుతున్న ఓ పాఠశాల

వికారాబాద్ అర్బన్: మన మనబడి పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. జిల్లాలో మన ఊరు- మన బడి కింద మొదటి విడతలో 360 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆగస్టు నెలలో పనులు ప్రారంభం కాగా కొన్ని కారణాల చేత మొదట 38 పాఠశాలలను మాత్రమే ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వాటికి వెనువెంటనే నిధులు సైతం విడుదల చేస్తున్నా పనులు మాత్రం పూర్తికావడం లేదు. మనబడి పనులు ప్రారంభమై ఆరు నెలలు కావస్తోంది. కలెక్టర్ ఇప్పటికే నాలుగు సార్లు డెడ్ లైన్ విధించారు. అయినా ఆయా మండలాల్లో మనబడులు పనులు పర్యవేక్షిస్తున్న ఏఈలు, కాంట్రాక్టర్లలో చలనం లేదు. దీంతో ఈ నెల 27 నాటికీ జిల్లాలో కనీసం 19 పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని వారం రోజుల కిందట కలెక్టర్ ఆదేశించారు. అయినా నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో అధికారుల పనితీరును తెలియజేస్తోంది.

ఎందుకు ఇంత నిర్లక్ష్యం..

మనబడి కింద చేపట్టిన పాఠశాలల పునఃరుద్ధరణ పనులు ఇతర జిల్లాలో ముగిసి ప్రారంభోత్సవాలకు నోచుకొంటున్నాయి. మన జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఒక్క పాఠశాల కూడా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. మన బడి పనులు చేస్తున్న 38 పాఠశాలల్లో ఎక్కడా కొత్త భవనాలు నిర్మించడం లేదు. ఉన్న పాత భవనాలనే కొత్తగా మారుస్తున్నారు. ప్రహరీలు నిర్మించడం, టాయిలెట్స్, వంట గదులు నిర్మించడం, రంగులు వేయడం వంటి పనులు మాత్రమే చేపడుతున్నారు. ఈ పనులకు ఇంత ఆలస్యం చేయడం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రెండు నెలల క్రితం వరకు ఒక్కో మండలంలో రెండు పాఠశాలల్లో మాత్రమే మన ఊరు మనబడి పనులు కొనసాగాయి. ఇప్పుడు మండలానికి ఒక్క పాఠశాలలోనే పనులు సాగుతున్నాయి. ఈ ఒక్క పాఠశాలలోనైనా సకాలంలో పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. సంబంధిత ఏఈలు ఈ పనులను కనీసం నెలలో ఒక సారి కూడా క్షేత్రస్థాయికి వెళ్లి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు చేయించడం, కలెక్టర్, అదనపు కలెక్టర్ల సమీక్షలకు నామమాత్రపు సమాచారంతో హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు కూడా నాణ్యతగా చేపట్టడంలేదని తెలుస్తోంది.



వికారాబాద్‌లోని సరస్వతీ శిశుమందిరంలో సామూహిక అక్షరాభ్యాసాలు

అక్షర పూజలు

వైభవంగా వసంత పంచమి వేడుకలు

వసంత పంచమి మహోత్సవ వేడుకలు జిల్లా అంతటా వైభవంగా జరిగాయి. సరస్వతీ అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు, మరోవైపు చిన్నారుల అక్షర స్వీకార పూజలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గురువారం వికారాబాద్ పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అర్చకులు చిన్నారులతో అక్షరాభ్యాసం గావించారు. తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

– అనంతగిరి

క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: తాండూరు మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విఠల్‌నాయక్‌ తండ్రి వర్త్య వాల్యా నాయక్‌ బుధవారం రాత్రి మృతి చెందారు. విఠల్‌ నాయక్‌ స్వగ్రామమైన యాలాల మండలం బాణాపూర్‌ గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్లు మెట్లి ఆశన్న, సప్తగిరి గౌడ్‌, సర్పంచ్‌లు బాలిబాయి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, కోఆప్షన్‌ సభ్యుడు అక్బర్‌ బాబా, సొసైటీ డైరెక్టర్‌ అశోక్‌రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, బాలయ్య, బాబయ్య, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

కూతురును హాస్టల్‌లో దించేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- కుమార్తెకు గాయాలు
- ఖానాపూర్‌ సమీపంలో ప్రమాదం

చేవెళ్ల: కూతురును హాస్టల్‌లో దించేందుకు బైక్‌పై గ్రామం నుంచి బయలుదేరిన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఖానాపూర్‌ బస్‌స్టేజీ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చేవెళ్ల ఎస్‌ఐ హయ్యూమ్‌ తెలిపిన వివరాలు.. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన చాకలి కృష్ణ (35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు కూతుళ్లు పెద్ద కూతురు పాలమాకుల వద్ద ఉన్న హాస్టల్‌లో ఉండి చదువుకుంటుంది. ఇటీవల ఇంటికి వచ్చిన కూతురును గురువారం హాస్టల్‌ వద్ద దింపేందుకు బైక్‌పై కూతురుతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. ఖానాపూర్‌ బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న క్రిష్ణ ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ వెనకాల కూర్చున్న కూతురు ఎగిరి దూరంగా పడటంతో కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన బాలికను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించటంతో వచ్చి పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య పద్మ, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



జయంతి వేడుకలకు హాజరైన విదేశీయులు

నందిగామ: ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని, తద్వారా ఆరోగ్యంగా జీవించగలుగుతారని రామచంద్ర మిషన్‌ గురుజీ, హార్ట్‌ఫుల్‌ నెస్‌ కేంద్రం గ్లోబల్‌ గైడ్‌ కమ్లేష్‌ పటేల్‌ సూచించారు. నందిగామ మండలం కాన్హా శాంతి వనంలోని హార్ట్‌ ఫుల్‌ నెస్‌ కేంద్రంలో రామచంద్ర మిషన్‌ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్‌ 150వ జయంతి ఉత్సవాలు రెండో రోజు గురువారం సాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుజీ మాట్లాడుతూ.. ధ్యానం చేయడంతో అనేక రుగ్మతలు తొలగిపోతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. లాలాజీ మహరాజ్‌ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం ప్రముఖ సంగీత కళాకారుడు ఉస్తాద్‌ అమ్జద్‌ అలీఖాన్‌ ఆలపించిన సంగీతం ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్సవాలకు హాజరైన వేలాది మందితో కలిసి గురుజీ ధ్యానం చేశారు.

గణతంత్ర వేడుకలకు వెళ్తూ..

ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి మృతి

మొయినాబాద్‌: గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం వెళ్తూ బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఓ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై మొయినాబాద్‌ మండల పరిధిలోని గండిపేట చౌరస్తా సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై శిరీష తెలిపిన వివరాలు.. మొయినాబాద్‌ మండలం అమీర్‌గూడ గ్రామానికి చెందిన మేకగూడెం ప్రవీణ్‌ (30) మంచిరేవుల సమీపంలో ఉన్న గ్రేహౌండ్స్‌లో ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై వెళ్తుండగా మండల పరిధిలోని గండిపేట చౌరస్తా సమీపంలో బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ మధ్యలో ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌, అడిషనల్‌ కలెక్టర్‌ తదితరులు



దేశభక్తి గీతాన్ని ఆలపిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



కలెక్టర్‌ నిఖిల నుంచి అవార్డు అందుకుంటున్న డీఈఓ రేణుకాదేవి



డీటీడబ్ల్యూఓ కోటాజీ



డీఆర్‌డీఓ కృష్ణన్‌



డీపీఆర్వో ఆరిఫొద్దీన్‌



డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌



ఆర్డీఓ విజయకుమారి



ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ బాబు మోజెస్‌



ఎస్‌బీ ఐటీసీటీ విభాగం సీఐ శ్రీనివాసరావు



టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌చార్జ్‌ సీఐ వెంకటేశం



సీసీఎస్‌ సీఐ ఆంజనేయులు

ఉత్తమ సేవలకు పురస్కారం

అందజేసిన కలెక్టర్‌ నిఖిల

అనంతగిరి: జిల్లాలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు వరించాయి. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ నిఖిల అవార్డులు అందజేశారు.

అవార్డులు అందుకున్న అధికారులు వీరే..

రెవెన్యూ శాఖలో డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌, వికారాబాద్‌ ఆర్‌డీఓ విజయకుమారి, సివిల్‌ సప్‌లై విభాగంలో డీఎంసీఎస్‌సీ విమల, డీసీఎస్‌ఓ రాజేశ్వర్‌, ఆడిట్‌ శాఖలో డీఏఓ వీరభద్రారావు, జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌, హార్టీకల్చర్‌ అధికారి చక్రపాణి, కార్మిక శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ బాబు మోజెస్‌, ఎస్సీ వెల్ఫేర్‌ అధికారి మల్లేశం, జిల్లా మైనార్టీ విభాగం అధికారి సుధారాణి, ఎస్టీ వెల్ఫేర్‌ అధికారి కోటాజీ, ఎల్‌డీఎం రాంబాబు, పరిశ్రమల శాఖ జీఎం వినయ్‌కుమార్‌, సర్వే లాండ్స్‌ ఏడీ ఎం.రాంరెడ్డి, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నవీన్‌చంద్ర, మున్సిపల్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర, పీఆర్‌ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్‌, డీపీఆర్‌ఓ ఆరిఫొద్దీన్‌, సీపీఓ నిరంజన్‌రావు, డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌ ఉన్నారు.

- కలెక్టరేట్‌లో శ్రావ్య, రెవెన్యూ విభాగంలో ఓంకుమార్‌, వెంకటస్వామి, సురేష్‌కుమార్‌, వేణుకుమార్‌, ఫారెస్టు విభాగంలో జగన్‌మోహన్‌, భాగ్యమ్మ, మల్లప్ప, పంచాయతీరాజ్‌ శాఖలో శంకర్‌, షఫీఉల్లా, రవీందర్‌, నాగరాజు, బాలకృష్ణ, సుగుణ, అలమయ్య, సాయి శ్రుతి, మహేందర్‌, సూర్యనారాయణ, రవికాంత్‌, ట్రైబల్‌ వెల్ఫేర్‌ శాఖలో భువనేశ్వరిదేవి, రాజు, ఎం రాజన్న, టీఎస్‌సీఎస్‌సీఎల్‌లో టీ రవి, ఖాజా అసరొద్దీన్‌, మదన్‌మోహన్‌, డీసీఎస్‌ఓలో శ్రీనివాసులు, పద్మ, శారద, సర్వే ల్యాండ్స్‌ విభాగంలో శివకుమార్‌, గౌస్‌, రామకృష్ణ, పీఆర్‌ ఇంజనీరింగ్‌ విభాగంలో మాధవరెడ్డి, రవికిరణ్‌రెడ్డి, సైదులు, ఆర్‌అండ్‌బీ శాఖలో మీన కేశవరావు, మెహరున్నీసా బేగం, లాలప్ప, టీఎస్‌ఈడబ్ల్యూడీసీలో ఎం శ్రీనివాస్‌, లక్ష్మప్ప, మహ్మద్‌ ఇర్ఫాన్‌, ఐ అండ్‌ సీఏడీడీలో భాస్కర్‌గౌడ్‌, శైబానా, మీర్జా మోసిన్‌బేగ్‌, బీసీ వెల్ఫేర్‌ విభాగంలో చంద్రకళ, స్వప్న, సత్తయ్య, ఎస్సీ వెల్ఫేర్‌ విభాగంలో ప్రవీణ్‌రెడ్డి, హేమలత, సాధిక్‌, రవాణా శాఖలో మేఘగాంధీ, శ్రీకాంత్‌, భాగ్యలత, జైళ్ల శాఖలో పర్మయ్య, ఎక్సైజ్‌ శాఖలో చంద్రకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్‌, వీరాంజనేయులు, గ్రౌండ్‌ వాటర్‌ విభాగంలో అరుణకుమారి, వినోద్‌కుమార్‌, హెల్త్‌ డిపార్ట్‌మెంట్‌లో డాక్టర్‌ దివ్య, రాజేశ్వరి, విమలాదేవి, మైనార్టీ వెల్ఫేర్‌ విభాగంలో ఎహసాన్‌అలీ, ఫకీరా రత్లావత్‌, మిషన్‌ భగీరథలో రాఘవేందర్‌, నయన శ్రీ, లలిత, డీహెచ్‌ఎస్‌ఓలో మల్లికార్జున్‌, కమల, యూసుఫ్‌ జానీ, వెటర్నరీ శాఖలో ఆనంద్‌, అనర్‌సింగ్‌, సాహితి, ప్లానింగ్‌ విభాగంలో నవీన్‌శెట్టి, రాజేందర్‌రెడ్డి, మహిపాల్‌, ఫైర్‌ విభాగంలో వెంకటరమణారెడ్డి, భిక్షపతి, గోపాల్‌, చంద్రయ్య, పీడీ ఆర్‌లో ఏపీఆర్‌ఓ ప్రభాకర్‌, డీఆర్‌డీఏ సెర్ప్‌లో శ్రీనివాస్‌, రాజు, ఎం శ్రీనివాస్‌, అంజిలప్ప, డీఆర్‌డీఓ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో స్టీవెన్‌నీల్‌, రాములు, రమేష్‌, శేషగిరి శర్మ, విఠల్‌రావు, సంతోషి, దినేష్‌కుమార్‌, సతీష్‌కుమార్‌, డీఆర్‌డీఏ స్టాఫ్‌లో రామ్మూర్తి, భార్గవి, శ్రీధర్‌, అశోక్‌కుమార్‌, సయ్యద్‌ అఫ్జల్‌ ఉన్నారు.
- ఎస్‌బీఐ – ఎల్‌బీఓలో విద్యాధర్‌, ప్రశాంత్‌ ఆనంద్‌, సతీష్‌, రవితేజ, అనుప్రభ గిరిజ, జయశ్రీ, సుధా పరిమళ, వికారాబాద్‌ మున్సిపల్‌ శాఖలో శ్రీధర్‌, ప్రత్యక్ష భీమారాయుడు, శివకుమార్‌, మెప్మాలో రవికుమార్‌, వెంకటేష్‌, సరిత, జెడ్పీ కార్యాలయంలో శివప్రకాష్‌, రమేష్‌కుమార్‌, వెంకటయ్య, డీడబ్ల్యూఓలో వెంకటేశ్వరమ్మ, లక్ష్మణ్‌, రవి, యాదమ్మ, జయప్రద, నీలవేణి, వ్యవసాయ శాఖలో షేక్‌ నజీరుద్దీన్‌, భావన, యోగేష్‌, డీవైఎస్‌ఓ విభాగంలో రవి, నవీన్‌కుమార్‌, విద్యాశాఖలో అబ్దుల్‌ ఘని, నర్సింలు, హరీష్‌కుమార్‌, డీసీహెచ్‌ఎస్‌ విభాగంలో రవిశంకర్‌, పద్మమ్మ, శివకుమార్‌, రాజు, శ్రీనివాస్‌, రతన్‌రాజ్‌, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌లో సురేష్‌రెడ్డి, ప్రమోద్‌సింగ్‌, యాదగిరి ఉన్నారు.
- పోలీసు విభాగంలో ఏఓ వందన, ఎస్‌బీ(ఐటీసీటీ) సీఐ శ్రీనివాసరావు, సీఐలు వెంకటేశం, ఆంజనేయులు, ఎస్‌ఐలు ఆనంద్‌కుమార్‌, సత్యనారాయణ, మైపాల్‌రెడ్డి, రాము, లాల్‌అహ్మద్‌, శీను, హెచ్‌సీ అంజాద్‌, వేణు, రాజు, యూనూస్‌, వెంకటేష్‌, రఘు, రాజు, ప్రశాంత్‌కుమార్‌, దేవి, శ్రీలేఖ, సుధాకర్‌, ఎండీ అఫ్జల్‌ పాషా ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



తహసీల్దార్‌ కార్యాలయం వద్ద నుంచి వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌



నంబర్‌ ప్లేట్‌ లేని ఇసుక ట్రాక్టర్‌

తాండూరు రూరల్‌: ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎలాంటి పత్రాలు లేకున్నా పట్టపగలు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగ్నానది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది కొరత కారణంగా తామే ఏమీ చేయలేకపోతున్నామని చెతులెత్తేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం రోజు కూడా ఇసుక అక్రమ రవాణా సాగింది. తాండూరు తహసీల్దార్‌ కార్యాలయం వెనక భాగం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలించారు. ఆ ట్రాక్టర్‌కు నెంబర్‌ ప్లేట్‌ కూడా లేదు. పట్టణంలోని సాయిపూర్‌, వినాయక టెంపుల్‌ పరిసరాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద పెద్ద ఎత్తున డంపింగ్‌ చేస్తున్నారు. ట్రాక్టర్‌ ఇసుకను రూ. 4వేల నుంచి రూ. 5వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణ సమీపంలోని ఖాంజాపూర్‌, బిజ్వార్‌, పాత తాండూరు మీదగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇంత బహిరంగగా రవాణా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులకు అధికార పార్టీ నాయకుల అండ ఉన్నట్లు తెలుస్తోంది.

> **ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు**
>
> గణతంత్ర దినోత్సవం కావడంతో గురువారం సెలవు. పాత తాండూరులోని వాగు నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. తహసీల్దార్‌ కార్యాలయంలో ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణాపై పూర్తిస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నాం. ఎవరైన సమాచారం ఇస్తే దాడులు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటాం.
>
> – చిన్నప్పల నాయుడు, తహసీల్దార్‌, తాండూరు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ కొండల్‌రెడ్డి
- క్రికెట్‌ టోర్నీ విజేత పట్లూర్‌ తండా జట్టు
- బహుమతులు అందజేత



విజేత జట్లకు నగదు బహుమతి అందజేస్తున్న కొండల్‌రెడ్డి తదితరులు

మర్పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌, ఎస్‌కేఆర్‌ ట్రస్టు వ్యవస్థాపకులు ఎస్‌ కొండల్‌రెడ్డి సూచించారు. మండలంలోని నర్సాపూర్‌ తండాలో సేవాలాల్‌ మహరాజ్‌ ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్‌ ట్రస్టు నిర్వహించిన క్రికెట్‌ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 42 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌ మ్యాచ్‌లో మండలంలోని పట్లూర్‌ తండా జట్టు, నర్సాపూర్‌ తండా జట్టు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పట్లూర్‌ తండా జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలని సూచించారు. అనంతరం విజేత జట్లకు మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ రామేశ్వర్‌, సహకార సంఘం వైస్‌ చైర్మన్‌ ఫసితో కలసి బహుమతులు అందజేశారు. విన్నర్‌ జట్టుకు రూ. 40వేలు, రన్నర్‌ జట్టుకు రూ. 21 వేలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బట్టు లలిత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ సురేష్‌, సహకార సంఘం డైరక్టర్లు మల్లారెడ్డి, జగదీష్‌, అనంత్‌రెడ్డి, ఎంపీటీసీలు సుజాత, వెంకట్‌, దామస్తాపూర్‌, మాజీ ఉప సర్పంచ్‌లు పాండురంగారెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు అంతిమ వీడ్కోలు

- నివాళులర్పించిన మేడ్చల్‌ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి
- సైబరాబాద్‌ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌



నివాళులర్పిస్తున్న హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌

కుల్కచర్ల: విధి నిర్వహణలో ట్రక్‌ ఢీకొని మృతి చెందిన చాపలగూడెంకు చెందిన హోంగార్డ్‌ శ్రీనివాస్‌ మృతదేహాన్ని బుధవారం రాత్రి స్వగ్రామానికి తెచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మేడ్చల్‌ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. శ్రీనివాస్‌ మృతి బాధాకరమన్నారు. పోలీస్‌ శాఖ నుంచి రావాల్సిన సాయాన్ని తక్షణం అందేలా చూస్తామని పేర్కొన్నారు. శ్రీనివాస్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సైబరాబాద్‌ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్‌ కుమార్‌ కోరారు. శ్రీనివాస్‌ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌, మన్మధరావు, బాలయ్య, సురేష్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం




భూమిక (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: మండల కేంద్రంలో యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీరాం కాలనీకి చెందిన భూమిక(20) ఈనెల 25న కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వాలపై ప్రజల్లో విరక్తి

- హామీల అమలులో విఫలం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- మైలారంలో హాత్‌ సే హాత్‌ జోడో యాత్ర ప్రారంభం



హాత్‌ సే హాత్‌ జోడో యాత్రలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని, దీంతో వారి పాలనపై ప్రజలు విరక్తి చెందారని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దోమ మండలం మైలారంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని హాత్‌ సే హాత్‌ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమైక్యత కోసం కాంగ్రెస్‌ పార్టీ అగ్రనేత రాహుల్‌ గాంధీ భారత్‌ జోడో యాత్ర చేపట్టారని తెలిపారు. అదే స్ఫూర్తితో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్‌ సే హాత్‌ జోడో యాత్రకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పరిగి నియోజకవర్గంలోని మైలారం గ్రామంలో యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ, టీఆర్‌ఎస్‌ పార్టీలు ప్రజలకు పలు హామీ ఇచ్చాయని, అధికారంలోకి వచ్చాక అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌ కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేయాలని సూచించారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ఇప్పటి నుంచే శ్రమించాలన్నారు. అప్పుడే విజయం సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు హన్మంతు ముదిరాజ్‌, రాములు నాయక్‌, ఉపాధ్యక్షుడు భీంరారెడ్డి, లాల్‌కృష్ణ ప్రసాద్‌, కుల్కచర్ల, పరిగి, దోమ, పూడూరు, గండీడ్‌ మండలాల అధ్యక్షులు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, పరుశురాంరెడ్డి, నర్సింహారావు, సురేందర్‌, యూవజన కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు సతీష్‌, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు రాంచంద్రారెడ్డి, యాదవరెడ్డి, బొయిని గోవర్ధన్‌, అనంతయ్య, అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చెన్నకిష్టయ్య, యాదయ్య, సత్తయ్య, జాకటి వెంకటయ్య, నాగవర్ధన్‌, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



కంటి వెలుగు స్టాల్‌ సందర్శన

అనంతగిరి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లో జరిగిన సంబురాల్లో జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆయా శాఖల స్టాల్స్‌ ఏర్పాటు

సంబరాల్లో భాగంగా డీఆర్‌డీఓ, మిషన్‌ భగీరథ, మైనార్టీ సంక్షేమం, ఎస్సీ వెల్ఫేర్‌ కార్పొరేషన్‌, వైద్యశాఖ, వ్యవసాయ శాఖ, బీసీ వెల్ఫేర్‌, పశుసంవర్ధక శాఖలు.. అభివృద్ధి కార్యకలాపాలపై స్టాల్స్‌ ఏర్పాటు చేశాయి. వాటిని కలెక్టర్‌ నిఖిల ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా వారివారి శాఖల పనితీరు, అభివృద్ధి గురించి కలెక్టర్‌కు వివరించారు.

జిల్లాలోని 308 స్వయం సహాయక సంఘాలకు రూ. 16.88 కోట్లు విలువ చేసే చెక్కులను, అదేలా 1,020 సంఘాల సభ్యులకు రూ. 5కోట్ల 10లక్షల 25వేల విలువ చేసేస్త్రీనిధి చెక్కును జిల్లా మహిళ సమాఖ్య ప్రతినిధులకు కలెక్టర్‌ చెక్కును అందజేశారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకం కింద 23 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



డీఆర్‌డీఏ శాఖ స్టాల్‌ను తిలకిస్తున్న కలెక్టర్‌

ప్రజా పోరాటం.. విచారణకు శ్రీకారం

- కెమికల్‌ ఫ్యాక్టరీపై నేడు విచారణ
- వివరాలు సేకరించనున్న ఆర్డీఓ
- త్వరలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రాక



కెమికల్‌ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఫైల్‌)

తాండూరు రూరల్‌: ఎట్టకేలకు ప్రజల పోరాటం ఫలిస్తోంది. కాలుష్యకారక పరిశ్రమపై విచారణకు అడుగులు పడ్డాయి. మండలంలోని గుంతబాసుపల్లి వద్ద ఉన్న కెమికల్‌ ఫ్యాక్టరీ నుంచి వాయు కాలుష్యం వెలువడుతోంది. పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసన వల్ల ప్రజలు శ్వాసకోస ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. దీంతో కొన్ని రోజులుగా గుంతబాసుపల్లి వాసులు పరిశ్రమను మూసివేయాలని పోరాటం చేస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యను తహసీల్దార్‌, కలెక్టర్‌, కాలుష్య నియంత్రణ మండలి, ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే చొరవతో అధికారుల్లో కదలిక వచ్చింది. రెండు రోజుల క్రితం గ్రామస్తులు ఎమ్మెల్యేని కలిశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే వాయు కాలుష్యాన్ని వివరించారు. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, ఆ నీటిని తాగలేకపోతున్నట్లు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము ఊరు వదిలి వెళ్లడం తప్ప మరో మార్గం లేదని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. స్పందించిన ఆయన ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నేడు విచారణ

గుంతబాసుపల్లి శివారులోని ఇండస్‌ చెమ్‌ పరిశ్రమను తాండూరు డివిజన్‌ ఆర్డీఓ అశోక్‌కుమార్‌ శుక్రవారం పరిశీలించనున్నారు. పరిశ్రమ నుంచి వెలువడే వాయు కాలుష్యంపై పూర్తి వివరాలు సేకరించనున్నారు. అంతేకాకుండా గ్రామంలో పర్యటించి భూ గర్భజలాల శాంపిల్స్‌ తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారుల బృందం కూడా గ్రామంలో పర్యటించనుంది. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంపై పూర్తి వివరాలు, అలాగే ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నారు.